

నాలుగు ఆర్‌ఓబిల నిర్మాణానికి అనుమతి: ఎంపీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉంగుటూరు, భీమడోలు మధ్య జాతీయ రహదారిపై నాలుగు చోట్ల రైల్వే ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వేకు సంబంధించిన సమస్యపై ఢిల్లీలో నిరంతరం తాను పర్యవేక్షిస్తున్నానని, ఫలితంగా మొదటి విడతగా నాలుగు ఆర్‌ఓబిల నిర్మాణానికి అనుమతి లభించిందని పేర్కొన్నారు. భీమడోలు, కైకరం, చేబ్రోలు, ఉంగుటూరు వద్ద నాలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించంగా, ఆమోద ముద్ర వేసిందని తెలిపారు. రానున్న ఆరేడు నెలల్లో వీటి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. వీటి నిర్మాణం పూర్తయితే రైల్వే ట్రాక్ వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నుంచి వాహనదారులకు ఉపశమనం లభిస్తుందని తెలిపారు.



అన్నదాతకు.. వర్షం టెన్షన్..!

- రబీలో అకాల వర్షాలతో రైతుల అవస్థలు
- చివరి దశలో ధాన్యం కొనుగోళ్లు
- ఏలూరు జిల్లాలో 20 వేల టన్నులు, 'పశ్చిమ'లో లక్ష టన్నులు ఇంకా రైతుల వద్దే
- ఈదురుగాలులు, వర్షాలకు రైతుల్లో గుబులు
- మామిడి రైతుల పరిస్థితి మరింత దారుణం
- టన్ను ధర రూ.13 వేల నుంచి రూ.7 వేలకు తగ్గుముఖం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీసాగులో అన్నదాత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అకాల వర్షాలు రైతులను వెంటాడటంతో ధాన్యం రైతు అడుగడుగునా నలిగిపోయిన పరిస్థితి నెలకొంది. ధాన్యం కొనుగోలు చివరి దశకు చేరుకున్నప్పటికీ అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రబీలో పశ్చిమలో 2.13 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 80 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ఏప్రిల్ రెండో వారం నుంచి ముమ్మరంగా వరి మాసూళ్లు ప్రారంభమయ్యాయి. 'పశ్చిమ'లో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసిన అధికారులు, ఏడు లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకూ 71,469 మంది రైతుల నుంచి 6.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.1,515 కోట్లు సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఏలూరు జిల్లాలో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యం కాగా 2.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు చేసి రూ.485.62 కోట్లు వరకూ రైతుల ఖాతాల్లో జమ చేశారు. ధాన్యం సొమ్ము మాత్రం 24 గంటలు గడవక ముందే రైతుల ఖాతాల్లో జమ కావడం రైతులకు ఊరటనిచ్చే అంశంగా చెప్పొచ్చు. రబీ ధాన్యం కొనుగోలు ప్రారంభం నుంచి అకాల వర్షాలు అన్నదాతను వెంటాడుతూనే ఉన్నాయి. రెండు, మూడు రోజులకోసారి పెద్దఎత్తున ఈదురుగాలులు, వర్షం రైతులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కొనుగోలులో టార్గెట్లతో ఏర్పడిన ఇబ్బందులు రైతులను కొంత ఉక్కిరిబిక్కిరి చేసింది. గడిచిన రెండు రోజులుగా వెంటాడుతున్న అకాల వర్షాలతో వరి రైతులు ఇంకా ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా పశ్చిమగోదావరి జిల్లాలో లక్ష టన్నులు, ఏలూరు జిల్లాలో 20 వేల టన్నుల వరకూ ధాన్యం రైతుల వద్దనే ఉంది. కొనుగోలుకు ఇబ్బంది లేకపోయినప్పటికీ మాసూళ్లు కొంత ఆలస్యమైనచోట్ల రైతులు వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారు. దెబ్బతిన్న పంటలకు 24 గంటల్లో నష్టపరిహారం ఇవ్వాలని సిఎం చెప్పారు. రెండు జిల్లాల్లో ధాన్యం తడిసినప్పటికీ నష్టం పరిగణనలోకి రాదనే కారణంతో జిల్లా రైతులకు ఎటువంటి పరిహారమూ అందని పరిస్థితి ఏర్పడింది. రబీలో ఈసారి ధాన్యం దిగుబడులు బాగా వచ్చినప్పటికీ అకాల వర్షాలతో రైతులు నానావస్థలు పడ్డారు. చివరి దశలో సైతం తిప్పలు తప్పకపోవడంపై అన్నదాత తీవ్ర ఆవేదనకు గురవుతున్నాడు.

మామిడి రైతులకు కోలుకోలేని దెబ్బ

అకాల వర్షాలు మామిడి రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. ఏలూరు జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాల్లో రైతులు మామిడి విస్తీర్ణం ఉంది. ఒక్క నూజివీడు డివిజన్‌లోనే 35 వేల ఎకరాల్లో మామిడి ఉంది. ఈదురు గాలులు, అకాల వర్షాలకు మామిడికాయలు రాలిపోవడంతో రైతులకు తీరని నష్టం ఏర్పడింది. మొన్నటి వరకూ టన్ను మామిడి ధర రూ.13 వేల వరకూ ఉండగా గడిచిన రెండు రోజుల్లో టన్ను రూ.ఏడు వేలకు పడిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ధర కోసం ఆగుదామని రైతులు వేచిచూసే పరిస్థితి లేకుండా పోయింది. ఈదురుగాలులకు కాయలు రాలిపోతున్నాయి. దీంతో రైతులు అయినకాడికి అమ్ముకోవాల్సిన దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది అకాల వర్షాలు మామిడి రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. అకాల వర్షాలు వరి, మామిడి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయని చెప్పొచ్చు.



నిరసిస్తున్న డ్వాక్రా మహిళలు

రుణం తీసుకోకుండా వడ్డీ వసూలు..!

బుట్టాయగూడెం మండలంలో డ్వాక్రా మహిళల ఆందోళన

వసూలు చేసిన వడ్డీ సొమ్ము తిరిగివ్వాలని డిమాండ్ - ఎంపిడిఒ జ్యోతికి వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అప్పు తీసుకోకుండా తమ ఖాతాల నుంచి వడ్డీ సొమ్ము తీసుకోవడంపై బుట్టాయగూడెం మండలంలోని గాడిదబోరు గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రెడ్డి గణపవరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో గాడిదబోరు గ్రామానికి చెందిన గాడిద బోరు గ్రామసంఘం ధనలక్ష్మి డ్వాక్రా గ్రూపుకు రూ.18,86,974, మహాలక్ష్మి డ్వాక్రా గ్రూపుకు రూ.18,69,928, గౌరమ్మ డ్వాక్రా గ్రూపుకు రూ.18,83,014, ముత్యాలమ్మ డ్వాక్రా గ్రూపుకు రూ.18,72,933, స్నేహలత డ్వాక్రా గ్రూపుకు రూ.19,29,864, ప్రియదర్శిని డ్వాక్రా గ్రూపుకు రూ.18,95,701 సొమ్ము ఆయా గ్రూపులకు చెందిన పొదుపు ఖాతాలో ఐదు నెలల క్రితం సిసిఎల్ లోన్ కింద జమైంది. ఈ విధంగా సుమారు రూ.కోటీ యాభై లక్షలు జమయ్యాయి. ఆయా గ్రూపుల ఖాతాల్లో సొమ్ము జమచేసిన విషయం గ్రూపు సభ్యులమైన తమకుగాని, డ్వాక్రా అధికారులకుగాని తెలియదని ఆయా గ్రూపుల డ్వాక్రా మహిళలు చెబుతున్నారు. బ్యాంకు నుంచి చిన్నపాటి లోన్ తీసుకోవాలన్నా సవాలక్షల నిబంధనలు విధిస్తారు. అలాంటిది రూ.కోటీ 50 లక్షలు సొమ్ము గ్రూపు సభ్యులకు, అధికారులకు తెలియకుండా బ్యాంకర్లు ఏవిధంగా జమచేశారో అంతుబట్టని పరిస్థితి నెలకొంది. సొమ్ము జమ చేయడమే కాకుండా గడిచిన ఐదు నెలలుగా ఈ సొమ్ముకు వడ్డీ సొమ్మును బ్యాంకు తిరిగి ఆయా ఖాతాల నుంచి తీసుకోవడం కొసమెరుపు. రుణం సొమ్ము కింద జమ చేసిన డబ్బుల నుంచి డ్వాక్రా సభ్యులకు తెలియకుండా వడ్డీ సొమ్ము మినహాయించుకుంటున్నట్లు సభ్యులు చెబుతున్నారు. ప్రతినెలా డ్వాక్రా సభ్యులు పొదుపు సొమ్ము కట్టేందుకు బ్యాంకుకు వెళ్తున్నప్పటికీ బ్యాంకర్లు పుస్తకంలో ప్రింట్ వేయకపోవడంతో సభ్యులకు ఏమాత్రం సమాచారం లేదని చెబుతున్నారు. గంగాదేవి అనే గ్రూపు సభ్యురాలు వ్యక్తిగత రుణం కోసం బ్యాంకుకు వెళ్లగా గ్రూపు ఖాతా నుండి దాదాపు రూ.నాలుగు లక్షలు వడ్డీ రూపంలో తీసుకున్నట్లు గ్రహించినట్లు వారంతా చెప్పుకొస్తున్నారు. దీంతో విషయం మిగిలిన సభ్యులకు తెలియజేసి దాడి గంగాదేవి, కుంజా పార్వతి, జోడే పోసమ్మ, జోడే ఆనసూయ, జోడే బుజ్జి, దాడి మంగతోపాటు దాదాపు 40మందికిపైగా డ్వాక్రా మహిళలు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎంపిడిఒ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎంపిడిఒ జ్యోతి మాట్లాడుతూ బ్యాంకు అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమస్యకు ప్రధాన కారణం బ్యాంకు ఖాతా పుస్తకాలను ప్రింటింగ్ వేయించకపోవడమేనన్నారు. బుట్టాయగూడెం మండలంలోని అన్ని బ్యాంకు లోను ప్రింటింగ్ ప్రక్రియ పూర్తిగా జరిగేలా చూడాలని డ్వాక్రా మహిళలు కోరారు.

డెంగీ జ్వరాలపై అవగాహనా పోస్టర్లు విడుదల

వ్యాధి లక్షణాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి : కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

డెంగీ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ముద్రించిన బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. శుక్రవారం ఏలూరు కలెక్టరేట్లో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ తీవ్ర జ్వరం, కండరాల నొప్పులు, కనుగుడ్ల నొప్పులు, డెంగీ లక్షణాలన్నారు. వ్యాధి లక్షణాలపై జిల్లాలోని పిహెచ్‌సిల పరిధిలో అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. దోమతెరలు వాడటం, ఇంటి కిటికీలకు, తలుపులకు జాలీలు బిగించుకోవాలన్నారు. తాగి వదిలేసి కొబ్బరి బొండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు, పనికిరాని వస్తువుల్లో నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎయిర్ కూలర్లు, ఫ్లవర్‌వాజ్‌లు, పూల కుండీలు నీటిని తరచూ మార్చుకోవాలన్నారు. డ్రెయినేజీలో ఆయిల్‌బాల్స్ వేసుకోవాలని, మలాథియాన్ టెక్నికల్ మందును ఫాగింగు ద్వారా దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ ఆవిష్కరణలో జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్.మాలిని, డిఎంఒ పిఎస్ఎస్.ప్రసాద్, ఎఎంఒ జె.గోవిందరావు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్, అధికారులు

ఏలూరు సిటీ: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా అరికట్టగలమని, డెంగీ నిర్మూలన ప్రజల సామాజిక బాధ్యతగా భావించాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఆర్.మాలిని సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం డిఎంహెచ్‌ఒ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి పిఎస్-ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ఆర్‌బో వైరస్ తరగతికి చెందిన నాలుగు రకాల డెంగీ వైరస్‌ల వల్ల ఈ జ్వరం వస్తుందన్నారు. ఆడ ఏడిస్ ఈజిప్ట్ దోమ మనిషిని కుట్టడం ద్వారా జ్వరం సంక్రమిస్తుందని తెలిపారు. డెంగీ సోకినవారిలో తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, ఒంటినొప్పులు ఉంటాయన్నారు. ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. డెంగీ జ్వరం నిర్ధారణకు అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో పరీక్ష ఉచితంగా చేస్తారని తెలిపారు. అనంతరం డెంగీ నిర్మూలన మనందరి బాధ్యత అని దోమ పుట్ట కాదు.. దోమ కుట్టరాదు, చిన్న కాటు పెద్ద ముప్పు అంటూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రోహిత్, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, డెమో నాగరత్నం, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.1.42 కోట్లకుపైగా నిధులు పక్కదారి..!

కలిదిండి ఎఎంసిలో ఎటువంటి తీర్మానమూ లేకుండానే ఖర్చు చూపిన వైనం

విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక మార్కెట్ యార్డు వ్యవహారాలపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాలకవర్గ సమావేశాలు, తీర్మానాలు లేకుండానే రూ.కోటీ 42 లక్షల 50 వేలు నిధులు నిబంధనలకు విరుద్ధంగా పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 2020 మార్చిలో స్థానిక మార్కెట్ యార్డుకు నూతన పాలకవర్గం ఏర్పడింది. నాటి నుండి మార్చి 2021 వరకు ఎటువంటి సమావేశాలు, తీర్మానాలు జరగలేదు. ఆ కాలంలోనే నిబంధనలకు విరుద్ధంగా 2020 సెప్టెంబర్‌లో రూ.కోటీ 42 లక్షల 50 వేలు ఖర్చు చేసినట్లు చూపారు. ఎటువంటి తీర్మాణం లేకుండా ఎఎంసి ఛైర్మన్, కార్యదర్శి కుమ్మక్కై ఈ నిధులను పక్కదారి పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు కోట కలిదిండికి చెందిన బస్వాని మహేంద్ర వర్మ తెలిపారు. మార్కెట్ యార్డు లో జరిగిన భారీ అవకతవకలపై ఉన్నతాధికారులతో విచారణ చేపట్టాలని ఆయన కోరారు.

నేడు 'స్వచ్ఛంధ్రా' విజయవంతంగా నిర్వహించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛంధ్రా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ నుండి డిపిఒ, జెడ్‌పి సిఇఒ, ఆయా మండలాల అధికారులు, ఆయా పురపాలక సంఘాల కమిషనర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణాలు, గ్రామాలతోపాటు మారుమూల గ్రామాల్లోనూ స్వచ్ఛంధ్రా కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఖాళీ స్థలాలు కలిగిన యజమానులు స్వచ్ఛందంగా చెత్తను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు బాగా పనిచేసేలా చూడాలని సూచించారు. అంగన్వాడీ సెంటర్లు, ప్రభుత్వ హాస్పిటల్స్, పర్యాటక కేంద్రాలు, బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో స్వచ్ఛంధ్రా కార్యక్రమాలు బాగా జరగాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఆ లోపాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా క్లీనింగ్, తాగునీటి పరీక్షలు, క్లోరినేషన్ చేయాలని, వీటికి సంబంధించిన వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని అన్నారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా రిజిస్టర్లను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. స్వచ్ఛంధ్రా కార్యక్రమాల్లో నూరుశాతం ప్రగతి సాధించిన గ్రామ పంచాయతీలు, వార్డులు, నగరపాలక సంస్థలో డివిజన్లను గుర్తించి వారికి సన్మాన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.


ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని, అధికారులు అంతకన్నా ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులు అర్థం చేసుకుని చక్కని పరిష్కారాన్ని చూపించాలని అన్నారు. పరిష్కారం కాని సమస్యలు ఉంటే అర్జీదారునికి ఏ కారణం చేత సమస్యను పరిష్కరించలేకపోతున్నామో అర్థమయ్యేలా వివరించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డిపిఒ అనురాధ, జెడ్‌పి సిఇఒ కె.భీమేశ్వరరావు పాల్గొన్నారు.

నూజివీడు కోర్టుకు వంశీ

29 వరకూ రిమాండ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నకిలీ ఇళ్ల పట్టాలిచ్చారనే కేసులో గన్నవరం మాజీ ఎంఎల్‌ఎ వల్లభనేని వంశీ, అతని అనుచరుడు రంగాలను పోలీసులు శుక్రవారం నూజివీడు కోర్టులో హాజరుపర్చారు. దీనిపై వారిద్దరికీ ఈ నెల 29 వరకు రిమాండ్ విధిస్తూ నూజివీడు సెకండ్ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.శ్రావణి ఆదేశాలిచ్చారు. ఈ కేసుకు సంబంధించి మాజీ ఎంఎల్‌ఎ వల్లభనేని వంశీ న్యాయవాది కెవికె.విక్రమ్ కుమార్ మాట్లాడుతూ సంబంధం లేని కేసులో వంశీని ఇరికించారని ఆరోపించారు. ముద్దాయిలకు కనీసం కేసు వివరాలను తెలపడం లేదని, అసలు నకిలీ పట్టాలు ఎక్కడున్నాయో అనేది కూడా చెప్పడం లేదన్నారు. ఎన్నికల సమయంలో దొంగ పట్టాలిస్తే అది ఎన్నికల కేసు అవుతుందని అన్నారు. కోర్టు వద్ద నూజివీడు పట్టణ సిఐ పి.సత్యశ్రీనివాస్, నూజివీడు రూరల్ సిఐ రామకృష్ణ ఆధ్వర్యాన గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోర్టుకు వల్లభనేని వంశీ సతీమణి పంకజశ్రీ వచ్చారు.



నూజివీడు కోర్టులో వంశీ

మితిమీరిన వేగం.. నిండు ప్రాణం బలి

మోటారు సైకిల్‌ను ఢీకొన్న లారీ



ప్రమాద స్థలంలో లారీ

ప్రజాశక్తి - మండవల్లి

మితిమీరిన వేగంతో వస్తున్న లారీ మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ఘటనలో మోటారు సైక్లిస్టు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం మణుగూరు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండవల్లి మండలం లోకుముడి గ్రామానికి చెందిన ఇంటి రాంబాబు, ముత్యాల లాజరు ఏలూరులో పనులు చూసుకుని ద్విచక్ర వాహనంపై లోకుమూడి వస్తున్నారు. శుక్రవారం సాయంత్రం మణుగూరు వద్దకు వచ్చేసరికి కైకలూరు నుండి ఏలూరు వెళుతున్న వెస్ట్ బెంగాల్‌కు చెందిన లారీ మితిమీరిన వచ్చి ఇంటి రాంబాబు మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందగా లాజర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. లాజర్‌ను చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాంబాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మండవల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏలూరు ఎఎంసి ఛైర్మన్‌గా నేడు పార్థసారధి ప్రమాణ స్వీకారం



ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మామిళ్లపల్లి పార్థసారథి శనివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. దీనికి సంబంధించి స్థానిక మార్కెట్ యార్డులో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. గత మార్చి 28న ఏలూరు ఎఎంసి ఛైర్మన్‌గా పార్థసారధిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా కమిటీ సభ్యులను సైతం నియమించింది. ఈ నేపథ్యంలో శనివారం పార్థసారధి ఎఎంసి ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

85 ట్రావెల్స్ బస్సులపై కేసులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 85 కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులపై కేసులు నమోదు చేసి రూ.3.70 లక్షల జరిమానా విధించామని ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపారు శుక్రవారం తెల్లవారుజామున జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాహన తనిఖీ అధికారులు కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. విశాఖపట్నం నుంచి విజయవాడ, విజయవాడ నుంచి విశాఖపట్నం మధ్య తిరిగే కాంట్రాక్టు క్యారేజ్ బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పర్మిట్ నిబంధనలను ఉల్లంఘించిన 85 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.3.70 లక్షలు అపరాధ రుసుముగా కరీం తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో జంగారెడ్డిగూడెం ఆర్‌టిఒ ఎమ్‌డి.మదని, వాహన తనిఖీ అధికారులు ఎస్.రంగనాయకులు, జి.ప్రసాదరావు, జి.స్వామి, వై.సురేష్‌బాబు, ఎస్.జగదీష్‌బాబు, కళ్యాణి, కృష్ణవేణి, పి.నరేంద్ర బాబు, అన్నపూర్ణ, డి.ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ అద్భుతం

నిట్ డీన్ వీరేష్ కుమార్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

త్రీడీ ప్రింటింగ్ ఎంతో అద్భుతమైన టెక్నాలజీ అని నిట్ డీన్ డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్ తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సంతోష్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి విచ్చేసిన వీరేష్ కుమార్ మాట్లాడుతూ వస్తువుల నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టేందుకు త్రీడీ ప్రింటింగ్ సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీని పలు రంగాల్లో విరివిగా ఉపయోగిస్తున్నారని, విద్యార్థులు ఈ సాంకేతికతపై నైపుణ్యాలను పెంచుకుని సొంతంగా కంపెనీలను ఏర్పాటుచేసే స్థాయికి ఎదగాలని వివరించారు. అనంతరం ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి శిక్షణకు హాజరైన 40 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. త్రీడీ ప్రింటింగ్‌పై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో అద్భుత ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆచార్యులు హైమావతి పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న యాజమాన్యం

హాస్టల్ భవనాల పరిశీలనకు కమిటీ

విద్యార్థులకు మంచి వసతి సౌకర్యాలు కల్పించాలి : కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు


జిల్లాలో శిథిలావస్థలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాల భవనాల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించడానికి కమిటీని నియమిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ల మరమ్మతులు, అభివృద్ధి పనులపై సంక్షేమ అధికారులు, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి, పబ్లిక్ హెల్త్, ఎపి ఇడబ్ల్యుఐడిసి ఇంజినీర్లతో పనుల పురోగతిపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కమిటీ నివేదిక ఆధారంగా వసతి గృహ భవనాల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వసతి గృహాల్లో విద్యార్థులకు మంచి వసతి సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వసతి గృహాల భవనాల మరమ్మతు పనుల పురోగతిని సమీక్షించారు. ఎప్పటికప్పుడు పనులు పరిశీలించాలన్నారు. వేసవి సెలవులు ముగిసి వసతి గృహాలు పున:ప్రారంభం నాటికి అన్ని పనులూ పూర్తి చేయాలని సంబంధిత శాఖల ఇంజినీర్లను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ ఇన్‌ఛార్జి జాయింట్ డైరెక్టర్ ఎం.ముక్కంటి, సూపరింటెండెంట్ పి.శ్రీనివాస్, వివిధ శాఖల ఇంజినీర్లు, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

టిడిపి మండలాధ్యక్షునిగా సుధీర్

ప్రకటించిన జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

టిడిపి మండలాధ్యక్షుడిగా గొల్లగూడేనికి చెందిన వేములపల్లి సుధీర్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. శుక్రవారం భీమడోలులోని టిడిపి కార్యాలయంలో ఉంగుటూరు మండల ముఖ్యనాయకుల సమావేశంలో సుధీర్‌ను నియమించినట్లు ఆప్కాబ్ ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ప్రకటించారు. మండల పూర్తిస్థాయి కమిటీని కొద్దిరోజుల్లో ప్రకటించనున్నారు. సుధీర్‌ను కడియాల రవిశంకర్, ఇమ్మణ్ణి గంగాధర్, సుంకవల్లి మధు, అక్కిన శేషు, నల్లా ఆనంద్, యువరాజ్, దిడ్ల శ్రీను, రెడ్డి చందు ఇతర నాయకులు పుష్పగుచ్ఛంతో అభినందించారు. సుధీర్ తండ్రి వేములపల్లి సూర్యచంద్రరావు టిడిపి గొల్లగూడెం గ్రామాధ్యక్షునిగా దీర్ఘకాలం వ్యవహరించారు. గొల్లగూడెంతోపాటు మెట్టప్రాంతాల్లో పట్టున్న సుధీర్‌కు మండల పగ్గాలు అప్పగించడం హర్షణీయమన్నారు.



సుధీర్‌ను అభినందిస్తున్న గన్ని



రాష్ట్రస్థాయిలో బాస్కెట్ బాల్ ఆటలో రాణించిన విద్యార్థినులు

రాష్ట్రస్థాయిలో రమణక్కపేట విద్యార్థుల ప్రతిభ


ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్రస్థాయిలో బాస్కెట్ బాల్ ఆటలో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజయం సాధించారని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ తెలిపారు. గత నెల 20వ తేదీన నూజివీడులో నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా సబ్ జూనియర్ తరపున విజయవంతంగా ఆడి, ఈ నెల 15వ తేదీ గురువారం చిత్తూరులో జరుగుతున్న అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి, ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టులో కీలక పాత్ర పోషించిన రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు జి.జెస్సి, బి.బెస్సి, కె.హర్షిత, బి.ఇందులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజును పాఠశాల సిబ్బంది అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


సమస్యలు వింటున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని సీతారామ కాలక్షేప కళ్యాణ మండపంలో ఒకటి నుంచి ఐదు వార్డుల్లో ప్రజలకు శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బాలరాజు హాజరై మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మండలంలోని ఐఎస్.జగన్నాథపురం, ఐఎస్. రాఘవాపురం, జి.కొత్తపల్లి, ముద్దులగూడెం, సిహెచ్.పోతేపల్లి, కోడిగూడెం పంచాయతీల్లో రెండో రోజు శుక్రవారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్ఎ పాల్గొని మాట్లాడారు. గ్రామాలాభివృద్ధికి చేపట్టాల్సిన అంశాల గురించి, ప్రధానంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు లంకా సత్యనారాయణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు దేవరపల్లి వీరస్వామి చౌదరి, మాజీ ఎంపిపి ఏపూరి దాలయ్య, పార్టీ మండల నాయకులు పోలిన శ్రీను, జనసేన మండలాధ్యక్షులు దాకారపు నరసింహమూర్తి, జెడ్‌పిటిసి సభ్యులు చిగురుపల్లి శామ్యూల్, బిసి మండల నాయకులు మట్టపర్తి రూపేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ముసునూరు

పరిసరాల పరిశుభ్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ అన్నారు. ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ మూడో శనివారం సందర్భంగా మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో ఆయా గ్రామ స్పెషల్ అధికారులు, గ్రామ పంచాయతీల సెక్రటరీల ఆధ్వర్యంలో గ్రీన్ ఎనర్జీ పేరిట గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.


సమ్మర్ క్యాంపులో పిల్లలు

విజయవంతంగా సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వసంతనగర్ కాలనీలో ఫ్రీ ఇండోర్ రోయింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంపు విజయవంతంగా కొనసాగుతోంది. ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన ఫ్రీ ఇండోర్ రోయింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంపు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏలూరు స్కల్లింగ్, రోయింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని, కార్యదర్శి ఎన్.పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు యు.జోషి, క్యాంపు ఇన్‌ఛార్జి కోచ్ ఊదర్ల విజయ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఫ్రీ సమ్మర్ కోచింగ్ క్యాంపు జాతీయ స్థాయి రోయింగ్ క్రీడాకారుడు ఊదర్ల విజయ్ ప్రారంభించి సుమారు 80 మంది పిల్లలకు ఎలాంటి ఫీజు లేకుండా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

రైలు నుంచి జారి పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

బెంగళూరు నుంచి బీహార్‌కు రైలులో ప్రయాణిస్తున్న యువకుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఈ ఘటన భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రం సహస్ర జిల్లా శౌర్య గ్రామానికి చెందిన రాహుల్ కుమార్ (23) స్వగ్రామం నుంచి బెంగళూరుకు వెళ్లి అక్కడ ఓ ప్రయివేట్ కంపెనీలో పనిచేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీ బెంగళూరు నుంచి బీహార్ బయలుదేరాడు. ఈ క్రమంలో భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి రైలు జారి పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్‌కు ఏడేళ్ల జైలు, జరిమానా

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో 2018లో నమోదైన రోడ్డు ప్రమాద కేసులో నిందితుడికి కొవ్వూరు కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2018లో కొయ్యలగూడెం చేపల మార్కెట్ వద్ద లారీ నడుపుతున్న చెరుకూరి నరసింహ అక్కినపల్లివారి లింగోటం గ్రామానికి చెందిన నడపాల మంగిరెడ్డి(45)ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మంగి రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సిఐ పి.రాజేష్ దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. సిఐ బాలరాజు ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా, కొవ్వూరు కోర్టులో విచారణ జరిగింది. ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి జివిఎల్.సరస్వతి శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున ఎపిపి కె. వెంకటరమణ వాదనలు వినిపించగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు చెరుకూరి నరసింహకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అంతేకాకుండా, బాధితుడికి నష్టపరిహారంగా రూ.10 లక్షలు చెల్లించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

ఎఎంసి ఛైర్మన్ పదవి ఎవరికి దక్కేనో..!

పోటీలో ప్రధానంగా ముగ్గురు

ప్రాధాన్యత సంతరించుకున్న 'చింతలపూడి' పదవి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందోనన్న ఆసక్తి రోజురోజుకు పెరుగుతుంది. ఎఎంసి ఛైర్మన్ పదవి కోసం నువ్వా నేనా అన్నట్లుగా పలువురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

చింతలపూడి వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ పదవి నియామకంలో అంతా సాధారణంగా సులువుగా జరగదు. అడుగడుగునా అంటంకలు, ఎత్తులపై ఎత్తులు ఉంటాయి. ఎవరూ తగ్గరు. చింతలపూడి పెద్దలకే కాకుండా పార్టీ అధిష్టానానికి కూడా తలనొప్పి తప్పదు. ఎఎంసి ఛైర్మన్ పదవి అంటేనే కత్తి మీద సాము వంటిది. చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ పదవికి అంతా ప్రాధాన్యత నెలకొంది. ఎంఎల్ఎ తర్వాత ఎంఎల్ఎ పదవని భావించే ఎఎంసి ఛైర్మన్ సీటు కోసం పలువురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 2014 నుంచి చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ పదవివి ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపుగా సంవత్సరం కావస్తున్నా ఇప్పటివరకు ఎఎంసి ఛైర్మన్ పదవిని ఎవరికి ఇవ్వకపోవడంతో కూటమి నాయకుల్లో కొంత అసంతృప్తి నెలకొంది. పోటీలో ప్రధానంగా గుత్త సాయి వరప్రసాదరావు, నందిగం బాబి తిలక్, సురనేని గోపి ఉన్నారు.

2014 నుంచి ఎఎంసి ఛైర్మన్ పదవి కోసం రెండు గ్రూపులుగా విడిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. పదవి కోసం ఏకంగా కోర్టుకు వెళ్లారంటే అర్థం చేసుకోవచ్చు.

పార్టీ అధిష్టానం అన్ని నివేదికలు పరిశీలించి త్వరలో ఎఎంసి ఛైర్మన్ పదవికి గ్రీన్ సిగ్నల్ ఇస్తుందని అందరూ భావిస్తున్నారు. అధిష్టానం మనస్సులో ఏ వ్యక్తి ఉన్నారో తెలియని పరిస్థితి. యువకులకు పెద్ద పీట వేస్తామని, యువకులకు ఎక్కువ అవకాశాలు ఇచ్చి పార్టీని బలోపేతం చేస్తామని సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చెబుతూనే ఉన్నారు. అలా యువకులకు ఇస్తే నందిగం బాబీకి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అలా కాకుండా అనుభవం, యువతను, పార్టీ పెద్దలను, పార్టీని ముందుండి నడిపించే వ్యక్తి కావాలనుకుంటే గుత్త సాయి వరప్రసాద్‌కు అవకాశం ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇద్దరూ పార్టీ విధేయులుగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని స్థానిక నాయకులు, కార్యకర్తలు చెబుతున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఆర్థికంగా మరింత బలోపేతం చేయడానికి, విజయపథంలో నడిపించడానికి కష్టపడి, 2024లో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఎంతగానో కృషి చేసిన వ్యక్తి పెదబాబు అని పలువురు నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. సిఎం చంద్రబాబు అన్ని విషయాలు కూలంకుశంగా ఆలోచించి పెదబాబుకు ఎఎంసి ఛైర్మన్ నామినేటెడ్ పదవి ఇస్తే ప్రజలకు ఆయన ఎంతో సేవ చేస్తారని ప్రజలు చెబుతున్నారు. యువకులైన నందిగం బాబికి అవకాశమిస్తే రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి ముందుకు తీసుకువెళ్తారని, 2029 ఎన్నికలకు సైన్యం ఏర్పాటు చేస్తారని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


చింతలపూడి ఎఎంసి భవనం

అదేవిధంగా సూరనేని గోపీనాథ్ పట్టాయగూడెం గోపీగా చింతలపూడి నియోజకవర్గం మొత్తం సుపరిచితులని, టిడిపి వీర విధేయుడని, గడచిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో ముఖ్యంగా చింతలపూడి మండలంలో ఆధిక్యత కోసం కష్టపడిన నాయకుడని పలువురు చెబుతున్నారు. 2006లో టిడిపి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చింతలపూడి జెడ్‌పిటిసి, ఎంపిపి పదవులు గెలుచుకోవడం కోసం ఎన్నో సమాలోచనలు జరిగాయి. ఆ క్రమంలో పార్టీ విజయదుందుభి మోగించడం ఒక చరిత్ర అని పలువురు నాయకులు చెబుతున్నారు. ఎఎంసి ఛైర్మన్‌గా గోపీనాథ్‌కు అవకాశం దక్కితే నియోజకవర్గ ప్రధాన కేంద్రంగా ఉన్న చింతలపూడి మండలంలో రానున్న స్థానిక ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని పలువురు కార్యకర్తలు భావిస్తున్నారు. అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో వేచి చూడాలి.


సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తోన్న పాక్ వెన్నులో వణుకు పుట్టించిన త్రివిధ దళాల సైనికులకు యావత్ దేశమంతా మద్దతుగా నిలిచిందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా భారత త్రివిధ దళాలకు మద్దతుగా ఏలూరులో శుక్రవారం భారీగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్ఎతో పాటు ఆర్‌టిసి విజయవాడ జోన్ - 2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, బిజెపి జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిషోర్, మాజీ ఎంఎల్ఎ, బిజెపి నాయకులు అంబికా కృష్ణ, జనసేన రాష్ట్ర నాయకురాలు ఘంటసాల వెంకట లక్ష్మి పాల్గొన్నారు. స్థానిక రామకోటి ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ వివిధ ప్రాంతాల మీదుగా కొనసాగి పాతబస్టాండ్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. పలువురు చిన్నారులు ప్రత్యేక దుస్తుల్లో ఈ ర్యాలీకి అగ్రభాగంలో నిలిచి అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి, ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోన్ - 2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడారు.

నేడు విజయోత్సవ యాత్ర

దెందులూరు : భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా ఈ నెల 18న సాయంత్రం నాలుగు గంటలకు దెందులూరులోని నందమూరి తారక రామారావు విగ్రహం నుంచి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు దెందులూరు నియోజికవర్గ స్థాయిలో ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో విజయోత్సవ యాత్ర నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.శ్రీదేవి, తహశీల్దార్ బి.సుమతి తెలిపారు. సదరు విజయోత్సవ కార్యక్రమంలో దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు మండలాల ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మండల స్థాయి, డివిజనల్ స్థాయి అధికారులు, నాలుగు మండలాల మాజీ సైనికులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొనున్నట్లు తెలిపారు.


ర్యాలీలో చంటి, రెడ్డి అప్పలనాయుడు, అంబికా కృష్ణ, తదితరులు

19 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - కలిదిండి

ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు స్థానిక శశి హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఎంఇఒ ఎ.రవిప్రకాష్ తెలిపారు. మండల పరిధిలోని 240 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కావాల్సి ఉందన్నారు. మండల పరిధిలో సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులందరికీ ఒకే పరీక్షా కేంద్రం కేటాయించినట్లు రవిప్రకాష్ తెలిపారు.

ముదినేపల్లిలో భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలి శ్రీ జగన్నాథస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. నాలుగు రోజుల పాటు స్వామివారి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయం వద్ద గురువారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సమారాధనకు వడాలి పరిసరా గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో యాత్రికులు హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి సింగంపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

రామారావుకు ఎంఎల్ఎ రోషన్‌కుమార్ పరామర్శ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఇటీవల గుండె సంబంధిత శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఎఎంసి మాజీ ఛైర్మన్, చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు పారేపల్లి రామారావును చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. మండలంలోని బయ్యన్నగూడెంలోని రామారావు నివాసానికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్ఎతో పాటు జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ, పార్టీ జంగారెడ్డిగూడెం రూరల్ మండలాధ్యక్షులు సాయల సత్యనారాయణ, ఎఎంసి మాజీ ఛైర్మన్ కోనేరు సుబ్బారావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు సుధీర్, పరిమి సత్తిపండు, చింతలపూడి నియోజకవర్గ నాలుగు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం



మాట్లాడుతున్న ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

గ్రామ స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని శ్రీరామవరంలో జనసేన పార్టీ మండలాధ్యక్షుడు అడపా నాగరాజు పుట్టినరోజు వేడుకల్లో శుక్రవారం పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామమ్మగూడెంలో స్థానిక సమస్యలపై గ్రామస్తులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామమ్మగూడెంలో రోడ్లు, గృహాలు, తాగునీటి సమస్యలపై నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారి నుంచి రామమ్మగూడెం రోడ్డు త్వరగా పూర్తి చేయాలన్నారు. రామమ్మ గూడెంలో అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు నివేదికలు పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కరాటం రాంబాబు, కరాటం సాయి, గడ్డమనగు రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని వినతి


కార్యదర్శి రమేష్‌తో మాట్లాడుతున్న కాలనీ వాసులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పెయ్యేరు శివారు వైఎస్ఆర్ కాలనీలో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ గతంలో ఏలూరు ఆర్‌డిఒకు వినతిపత్రం అందించామని స్థానిక ప్రజలు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాలనీ వాసులు మాట్లాడుతూ 147 ఇళ్లల్లో 650 మంది నివాసం ఉంటున్నారన్నారు. 12 ఏళ్లుగా డ్రెయినేజీ సమస్య ప్రధానంగా ఉందన్నారు. మురుగు నీరు వెళ్లేందుకు మార్గం లేదన్నారు. చిన్న పిల్లలు ఆ మురుగు నీటిలోనే వెళ న్నారన్నారు. దోమలు విపరీతంగా ఉన్నాయని వాటి వల్ల జ్వరాలు ప్రబలటానికి ఎక్కువ అవకాశం ఉందని చెప్పారు. మురుగు నీరు నిల్వ ఉండడంతో రోడ్లు పాడైపోయాయని, వాహనాలు వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాలనీ మొత్తం దుర్భరమైన వాసన వస్తుందన్నారు. డ్రెయినేజీ సమస్యను పరిష్కరించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతూ కార్యదర్శి రమేష్‌కు కాలనీ వాసులు వినతిపత్రం అందించారు.

కౌలు రైతులందరూ కౌలు కార్డు తీసుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి


ప్రతి కౌలు రైతూ వారు కౌలు చేసే భూ యజమాని అంగీకారంతో కౌలు కార్డు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి బి.వేణుమాధవ్ అన్నారు. ముదినేపల్లి తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులకు, గ్రామ వ్యవసాయ సహాయకులకు పంట సాగు దారు హక్కు పత్రం (కౌలు గుర్తింపు కార్డులు)పై శుక్రవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వేణుమాధవ్ మాట్లాడుతూ కౌలు రైతులు వారి ఆధార్ కార్డ్, జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటో, తాము సాగు చేసే భూ యజమాని పొలం పాస్ బుక్ జిరాక్స్ వారి గ్రామ రెవెన్యూ అధికారి విఎఎకు అందించాలని వివరించారు. గ్రామ రెవెన్యూ అధికారి వారి లాగ్ ఇన్ నుంచి ఇ సిసి ఆర్‌సి కార్డ్స్ రైతులకు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి ఇన్‌ఛార్జి తహశీల్దార్ పవన్‌కుమార్, ఆయా గ్రామ విఆర్ఒ, విఎఎలు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు ఇప్పించండి మహాప్రభో..!

నామవరం వాసుల వేడుకోలు

ప్రజాశక్తి - చింతలపూడి

గత రెండు మూడుర వారాలుగా గ్రామంలో నీళ్ల రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండలంలోని నామవరం గ్రామస్తులు వాపోతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. చిన్నపిల్లలు అల్లాడిపోతున్నారని ఆవేదన చెందుతున్నారు. తాగునీరు ఎందుకు రావడంలేదని అడిగితే మోటార్ పోయిందని సమాధానం చెబుతున్నారన్నారు. నెలలో రెండు, మూడు సార్లు మోటార్ మరమ్మతులకు గురవుతుందన్నారు. కొత్త మోటార్ ఎందుకు వేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇలాంటి సమస్యలు రాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.


తాగునీటి కోసం నామవరం వాసుల ఎదురుచూపు

రెయిలింగ్‌ను ఢీకొట్టి తుప్పల్లోకి దూసుకెళ్లిన కారు

ఒకరు మృతి : నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన రెయిలింగ్‌ను ఢీ కొట్టిన కారు తుప్పల్లోకి దూసుకెళ్లిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా నలుగురు ఈ గాయాలపాలయ్యారు. ఈ ఘటన మండలంలోని లక్ష్మీపురం సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గుళ్ల పొగాకు వ్యాపారం నిమిత్తం ఐదుగురు వ్యక్తులు శుక్రవారం కొయ్యలగూడెం నుంచి జీలుగుమిల్లికి కారులో బయలుదేరారు. లక్ష్మీపురం సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పిన కారు జాతీయ రహదారి పక్కన రెయిలింగ్‌ను ఢీ కొట్టి తుప్పల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయాలపాలయ్యారు. ఐదుగురిని స్థానికులు 108 అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో తలకు తీవ్ర గాయమైన కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ముప్పిడి ప్రసాద్ (55) ఆసుపత్రికి వెళ్లగానే మృతి చెందాడు. మిగిలిన నలుగురు చికిత్స పొందుతున్నారు. వీరు గుంటూరు, ఒంగోలు పరిసర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ గుళ్ల పొగాకు వ్యాపారం చేస్తుంటారని చెబుతున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల వివరాలు సేకరించారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు ముందుభాగం

డెంగీ నివారణపై అవగాహన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

జాతీయ డెంగీ నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని బయ్యన్నగూడెం పిహెచ్‌సిలో డెంగీ వ్యాధి నివారణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వి.సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు.

ముసునూరు : దోమ కాటుకు గురై దీర్ఘకాలిక వ్యాధులకు గురికాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పిహెచ్‌సి వైద్యులు కరీముల్లా సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రమణక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రధాన సెంటర్ వరకు శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు కరీముల్లా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

నిర్వాసితులు, కార్మికులు, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిల్లి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ముఖ్య కార్యకర్తల శిక్షణా తరగతులు యర్నం సాయికిరణ్ అధ్యక్షతన మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మానుకొండ జీవరత్నం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిల్లి రామకృష్ణ క్లాసులు బోధించారు. ఈ తరగతుల్లో యర్రంశెట్టి నాగేంద్రరావు, సత్యవతి, హరినాధ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి 30 ఎకరాల భూమి కేటాయింపు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి ఉపాలయమైన ద్వారకాతిరుమల మండలంలోని ఐఎస్.జగన్నాథపురంలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం అభివృద్ధి నిమిత్తం 30 ఎకరాల భూమిని కేటాయించారు. ఆ భూమికి సంబంధించి ల్యాండ్ హాండెడ్ ఓవర్ సర్టిఫికేట్‌ను గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు, తహశీల్దార్ జెవి.సుబ్బారావు శ్రీవారి ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్‌విఎస్ఎన్.మూర్తికి అందించారు.